క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక సూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు, సూకాంబిక సేవా బృందం సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 1.09 లక్షల విరాళం



దాత శ్రీనివాస్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,09,000 ను విరాళంగా అందజేశారు. పినకడిమికి చెందిన సీహెచ్ శ్రీనివాస్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గోవింద స్వాముల ఇరుముడిధారణ



ఇరుముడులు ధరిస్తున్న గోవింద స్వాములు

ద్వారకాతిరుమల : మండలంలోని తిరుమలంపాలెంలో గోవింద స్వాములు ఆదివారం ఇరుముడిధారణ చేశారు. గురుమాత గుంపుల నాగలక్ష్మి ఆధ్వర్యంలో, అరిగిల శ్రీరామ చంద్రుడు, పురోహితులు శనగవరపు నాగేశ్వరరావుల సమక్షంలో దీక్షాదారులు ఇరుముడులను ధరించారు. అనంతరం శ్రీవారి గిరి ప్రదక్షిణ వేడుకలో పాల్గొన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వారంతా సోమవారం శ్రీవారికి ఇరుముడులను సమర్పించనున్నారు.

కోడిపందేలపై దాడి

చింతలపూడి : చింతలపూడి మండలం, యర్రంపల్లి గ్రామంలో కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 3 పుంజులు, రూ.1,530 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల : మండలంలోని వెంకటకృష్ణాపురం గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై ఆదివారం ఉదయం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 6,100 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని పలు చోట్ల నీటి సరఫరా నిలిచిపోయిందని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పశ్చిమ మండల అధ్యక్షులు నడపన దాన భాస్కర్ ఆదివారం జేసీ పి.అరుణ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ శాంతినగర్, ఫిరంగుల దిబ్బ, విద్యానగర్, ఆదర్శ్ నగర్, ఏటిగట్టు, పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాల్లో గత మూడురోజులుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని, దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి సంబంధించి స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ కల్వకొలను సాంబ, 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, ఏలూరు కార్పొరేషన్ సెక్రెటరీని కలిసి వినతి పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు సహకరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి విద్యుత్ ఉద్యోగులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు కోరారు. ఓసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్, డైరీలను ఎస్ఈ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న విద్యుత్ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. రైతులకు వ్యవసాయం కోసం 9 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ అందించడానికి శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. సంఘం రాష్ట్ర నాయకుడు తురగా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు



దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు



జంగారెడ్డిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ బాబ్జికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం



నరసన్నపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, అధికారులు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి నుంచి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. దుద్దుకూరులోని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో అధికారులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ పుస్తకాలు, పెన్నులు, అట్టలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు కరాటం జానకీరామ్, ఏఎంసీ ఛైర్మన్ కరాటం సీతాదేవి ఇంటి వద్ద వేడుకలు జరిగాయి. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కరాటం కృష్ణస్వరూప్, సయ్యద్ బాజీ, కొవ్వాసి నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జికి మండలంలోని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. లక్కవరంలో జరిగిన వేడుకల్లో పార్టీ నాయకులు దల్లి నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణల చేతుల మీదుగా వీటిని అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు బడి దుర్గారావు, ఉప సర్పంచ్ నిమ్మ రామకృష్ణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి పాల్గొన్నారు. చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో సీఎస్ఐ చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్ కుమార్ కేక్ కట్ చేశారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

లింగపాలెంలో...

లింగపాలెం : నూతన సంవత్సర వేడుకలను ఆదివారం లింగపాలెం మండల ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. నరసన్నపాలెంలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంపీపీ వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని వారు ఆకాంక్షించారు. తోచలకరాయుడుపాలెంలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు 15 చర్చిల్లో కేక్‌లు బహుకరించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం, ఏఓ కామేశ్వరి, ఈఓపీఆర్‌డీ జేఎం రత్నకుమార్, జగన్నాధరావు, పరస్పా సత్తిరాజు, ఉప సర్పంచ్ బేతిన మధు, పార్టీ నాయకులు యలమంచిలి సత్తిబాబు, పి బాబురావు, హృదయరాజు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం : నూతన సంవత్సరం ప్రజలు సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ఆకాంక్షించారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన సంవత్సరం నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన పనులను కొనసాగిస్తూనే మరిన్ని కార్యక్రమాలు చేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అత్యుత్తమంగా నిలిపేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో 2023–24 సంవత్సరానికి ఛాంబర్ అధ్యక్షుడిగా వందనపు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పీపీఎస్‌లను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యాపార సంఘాలు ప్రకటించాయి. ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ సాయిబాల పద్మ, ఆయా వ్యాపార సంస్థల అసోసియేషన్‌ల అధ్యక్షులు, పలువురు కౌన్సిలర్‌లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్‌ను కట్ చేశారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, కౌన్సిలర్‌లు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే మన్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి నివాసానికి వెళ్లి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిన్నదంపతులతో కలిసి ఎమ్మెల్యే కట్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



చింతలపూడి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీలో నూతనంగా చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ఎలీజా



ఏఎంసీ ఆవరణలో లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి

చింతలపూడి : నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం అని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులు ఎలీజాకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలం అందచేసినట్లు చెప్పారు. దాదాపుగా కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఏ పని కావాలన్నా తన దృష్టికి తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక

నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దేశావతు బద్దు నాయకత్వంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ఎస్.దుర్గారావు, మిరియాల దిలీప్, ఎం.ఇమ్మానియేలు, ఎస్.కాంతారావు, కె.యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో : మార్కెట్ కమిటీ ఆవరణలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్ పాల్గొన్నారు. మండలంలోని పలు చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెంచిన పింఛన్ల పంపిణీ



ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : నూతన సంవత్సర శుభాకాంక్షలతో జనవరి 1వ తేదీ నుంచి అవ్వ తాతలకు రూ. 2,750 పింఛన్ ఇస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. ఆదివారం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల వేళ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2 వేలు పింఛన్ ఇస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వగానే చంద్రబాబు ప్రభుత్వం అప్పటికప్పుడు 2019 ఫిబ్రవరిలో మాత్రమే పెంచారని అన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే పింఛను రూ. 2250 పెంచి ఇచ్చారని చెప్పారు. అలాగే 2022 జనవరిలో రూ. 2500 పెంచి పింఛన్లు అందేలా చేశారని అన్నారు. అదేవిధంగా 2023 జనవరి 1 నుంచి రూ. 2750కు పెంచి అవ్వ,తాతలకు నూతన సంవత్సర కానుకగా అందజేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే అధికార యంత్రాంగం అన్ని గ్రామాల్లో పింఛన్లు అందేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. అయితే మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పెంచిన మరికొన్ని పింఛన్లను మండల పరిషత్ కార్యాలయం వద్ద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలరాజుతో పాటు వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు.

శ్రీనివాసపురంలో పింఛన్ల పంపిణీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : శ్రీనివాసపురంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం పెంచిన పింఛన్ ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పింఛన్ సొమ్ము పెంచి పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చల్లవారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్‌కుమార్, పట్టిన్నపాలెంలో సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. పసుపులేటి నాగార్జునరావు, ఎంపీటీసీ రామిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం



సరిపల్లిలోని స్వయంభు సంజీవ ఆంజనేయస్వామి

కొయ్యలగూడెం : ముక్కోటి పర్వదినోత్సవానికి వైష్ణవ క్షేత్రాలు సిద్ధం అయ్యాయి. సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల వ్యాప్తంగా రామాలయాలు, కృష్ణాలయాల వద్ద ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. కొయ్యలగూడెంలోని ప్రఖ్యాతిగాంచిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు అర్చకులు శేషాచార్యులు తెలిపారు. సరిపల్లిలోని స్వయంభు సంజీవ అంజనేయ స్వామి బయ్యన్నగూడెం, ఆరిపాటి, కన్నాపురంలలోని అభయాంజనేయ స్వామి అలయాలలో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు





శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ, శ్రీవారి క్షేత్రంలో తొళక్క వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త సంవత్సరం అంతా శుభదాయకంగా ఉండాలన్న ఉద్దేశంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దర్శనం క్యూలైన్లు యాత్రికులతో కిక్కిరిసాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో నిండుగా కనిపించాయి. అలాగే పార్కింగ్ ప్రదేశం భక్తుల వాహనాలతో నిండిపోయింది. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. నిత్యాన్నదాన భవనంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు స్వయంగా పరిశీలించారు.

ప్రతి ఇంటి ముంగిట శ్రీవారికి నీరాజనాలు

నూతన సంవత్సరం తొలిరోజున తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాధికాలు జరిపి, నీరాజనాలు సమర్పించారు. చిన వెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ఈ ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారిని, అమ్మవార్లను ఉంచి అర్చకులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

యూనియన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల పుల్లారావు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా ఎలక్ట్రికల్ ప్లంబర్ల మోటార్ వర్కర్ల యూనియన్ సమావేశం కర్రి సూర్యం అధ్యక్షతన ఆదివారం ధర్మన్న స్మారక భవనంలో జరిగింది. ఈ సమావేశంలో అధ్యక్షుడు ఆవుల పుల్లారావు మాట్లాడుతూ గుర్తింపు కలిగిన ఎలక్ట్రికల్ వర్కర్లచే పనులు చేయించుకోవాలని కోరారు. యూనియన్‌లో గుర్తింపు కలిగిన సభ్యులకు త్వరలో ఐడెంటీ కార్డులు మంజూరు చేస్తామన్నారు. సభ్యులంతా సంఘటితంగా ఉండాలని, ప్రతినెలా ఒకటో తేదీన ఇష్టా కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఇష్టా జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ నిర్మాణ కార్మికులందరూ తమ హక్కుల రక్షణకై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ జనరల్ సెక్రటరీ కర్రి సూర్యం, నాయకులు కోటా శివకృష్ణ, వనపర్ల నవీన్, బాలిన ధర్మరాజు, మానేపల్లి రామారావు, ఎంఎల్ఎన్ రాజు, తియాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం ఏలూరు మండలం కొల్లేరు గ్రామాల పెద్దలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, గుడివాకలంక ఉపసర్పంచ్ ఘంటసాల రుక్మనంద మహరాజ్ తదితరులు కొల్లేరు గ్రామాలకు ప్రభుత్వ కళాశాల మంజూరు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రతిరోజూ కొల్లేరు గ్రామాల నుంచి విద్యార్థులు సుమారు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఏలూరులో కళాశాలకు వెళ్లి వస్తూ అవస్థలు పడుతున్నారని వివరించారు. దీనిపై ఎంపీపీ స్పందించి మాట్లాడుతూ మండలానికి ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి చేస్తున్నారన్నారు.

విద్యుదాఘాతానికి తాటాకిల్లు దగ్ధం



జి.కొత్తపల్లిలో దగ్ధమౌతున్న తాటాకిల్లు

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి ఆదివారం తెల్లవారుజామున ఒక తాటాకిల్లు దగ్ధమైంది. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోడ బాలరాజు కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇంటికి నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదాన్ని గుర్తించిన బాలరాజు, కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి, ప్రాణాలను దక్కించుకున్నారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లోని సామాగ్రితో పాటు పొలం దస్తావేజులు, 3 కాసుల బంగారం, రూ.3 లక్షల నగదు కాలిబూడిదైనట్టు బాధితుడు బాలరాజు తెలిపాడు.

అలరించిన నృత్యోత్సవం



శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో నాట్యకారిణుల ప్రదర్శన

ద్వారకాతిరుమల : శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన నృత్యోత్సవం చూపరులను అలరించింది. దేవదాయ శాఖ – ధర్మ పథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ నృత్యోత్సవాన్ని ముందుగా ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్యకారిణులు భరతనాట్య ప్రదర్శనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నృత్యప్రదర్శనను తిలకించారు.

సీఎం ఉపాధ్యాయులకు బాసటగా నిలవాలి

ఏలూరు రూరల్: నాడు–నేడు పథకం ద్వారా కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉపాధ్యాయులు బాసటగా నిలవాలని ఎంపీడీఓ బి.ప్రణవి కోరారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీడీఓ ప్రణవి, నాయకులు యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.